సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 24 । జూన్ । 2023



వానాకాలం.. వ్యాధుల భయం

వర్షాకాలం వచ్చిందంటే వ్యాధుల భయం మొదలవుతుంది. వాతావరణంలో మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. IIలో ▸



స్థలాలను అడ్డుకోవడంపై నిరసన

ప్రభుత్వం తమకు మంజూరు చేసిన ఇంటి స్థలాలను గ్రామానికి చెందిన కొందరు అడ్డుకుంటున్నారంటూ తిరుమలంపాలెంలో గ్రామస్తులు నిరసన తెలిపారు. IIలో ▸

ఆర్టీసీ రాయితీలు

ఆర్టీసీ బస్సుల్లో దూరప్రాంతాలకు ప్రయాణం చేసేవారికి టికెట్ ధరలో రాయితీ ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. రానూపోనూ చార్జీల్లో 10 శాతం రాయితీ లభిస్తుందన్నారు. IIలో



న్యూస్‌రీల్

ప్రత్యేకాధికారి పరిశీలన



సూచనలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు

పాలకోడేరు: పాలకోడేరు మండలంలో శుక్రవారం జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు పర్యటించారు. మోగల్లులో నాడు–నేడు పనులు, జగనన్న లేఅవుట్‌లో గృహనిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రం, సచివాలయం, పాఠశాలలను పరిశీలించారు. అధికారులకు సూచనలు, సలహాలు అందజేశారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి గదులు, సౌకర్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రులు, 104 ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ఆర్డీఓ దాసిరాజు, డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ, ఎంపీడీఓ నూకల మురళి గంగాధర్, ఆర్ఐ నాగభూషణరావు, పీహెచ్‌సీ డాక్టర్ చినమిల్లి రంగనాయుడు ఆయన వెంట ఉన్నారు.

భీమవరం ఇన్‌చార్జి కమిషనర్‌గా సుధాకర్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా కేటీ సుధాకర్‌ను నియమించారు. భీమవరం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఎస్.శివరామకృష్ణ అక్రమాస్తులు కలిగి ఉన్నారని ఏసీబీ అధికారుల సోదాల్లో తేలడంతో అరెస్ట్ చేశారు. దీంతో ఆయన స్థానంలో సుధాకర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

చింతమనేనీ ఖబడ్దార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు

దెందులూరు: 'ఆడపిల్లలపై కర్రలు, ఇనుపరాడ్లతో కొట్టిస్తావా.. దిగజారి నీచ రాజకీయాలు చేస్తావా.. నీకు దమ్ము ధైర్యం ఉంటే నాతో పెట్టుకో.. మరోసారి నియోజకవర్గంలో ఇటువంటి సంఘటనలు తలెత్తితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.. ఖబడ్దార్ చింతమనేని' అని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం, ప్రశాంతత, అందరి యోగక్షేమాలు తాను కోరుకుంటున్నానని అయినా అడుగడుగునా, గ్రామగ్రామాన ఏదో సాకుతో టీడీపీ శ్రేణులు దాడులు, దౌర్జన్యాలు, హింసకు పాల్పడుతున్నారని, ప్రజాస్వామ్యంలో ఇది ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. తాను ముమ్మాటికీ నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రశాంతతపైనే దృష్టి సారించానని, తన మౌనాన్ని చేతకానితనంగా భావిస్తే చింతమనేని, టీడీపీ శ్రేణులకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, దెందులూరు, పెదవేగి జెడ్పీటీసీలు నిట్టా లీలానవకాంతం, పెనుమాల విజయ్‌బాబు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, జిల్లా కార్యదర్శి పిళ్లెం శ్యాంతంబి ఆయన వెంట ఉన్నారు.

టెన్త్ సప్లిమెంటరీలో 47.68 శాతం ఉత్తీర్ణత

సాక్షి, భీమవరం: జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో 47.68 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు డీఈఓ ఆర్.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. 8,717 మంది హాజరుకాగా 4,156 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో బాలురు 5,189 మందికి 2,159 మంది, బాలికల్లో 3,528 మందికి 1,997 మంది ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు సబ్జెక్ట్‌కు రూ.1,000 చొప్పున ఈనెల 29లోపు సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సూచించారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదల కాగా ఏలూరు జిల్లాలో 4,270 మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్షలకు 9,361 మంది విద్యార్థులు హాజరు కాగా 45.61 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలురు 5,390 మందికి 2,176 మంది, బాలికలు 3,971 మందికి 2,094 మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థుల మార్కుల జాబితాలను బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈఓ ఎస్వీ రవిసాగర్ తెలిపారు. ఈనెల 29లోపు విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సబ్జెక్టుకు రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1,000 చొప్పున సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా చెల్లించి దరఖాస్తులను తన కార్యాలయంలో సమర్పించాలన్నారు.

వర్జీనియా.. ధర అదిరిందయ్యో

పొగాకు ధరలు పైపైకి..

- తొలిసారి కిలో రూ.280గా నమోదు
- రూ.200కు పైగా సగటు ధర
- దేశీయ, అంతర్జాతీయ అవసరాలకు పెరిగిన డిమాండ్
- రైతుల ఆనందోత్సాహాలు



జంగారెడ్డిగూడెంలో వర్జీనియా వేలం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు వేలం ప్రక్రియలో మరో రికార్డు నమోదైంది. వేలం ప్రారంభంలో కిలోకు అత్యధికంగా రూ.210 పలికిన ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో తొలిసారి రూ.250 దాటి ఆశ్చర్యపరిచింది. అప్పటినుంచి అత్యధిక ధర రికార్డులను తాకుతూ శుక్రవారం రూ.280 పలికింది. గతేడాది అత్యధిక ధర రూ.245 పలకగా ఈనెల 15న రూ.250 మార్కు దాటింది. తర్వాత రూ.254కు చేరి ధరల ర్యాలీ కొనసాగుతోంది. 16న రూ.258, 19న రూ.266, తర్వాత రూ.268 పలికింది. తాజాగా ఒకేసారి రూ.12 పెరిగి రూ.280కు చేరి నూతన రికార్డు సృష్టించింది. దీంతో రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

అదే కోవలో సగటు ధర

పెరిగిన పెట్టుబడుల దృష్ట్యా అత్యధిక ధర కన్నా సగటు ధర అనుకున్న స్థాయిలో వస్తేనే లాభపడతామనే ఆశతో రైతులు ఉన్నారు. సగటు ధర రూ.200 పైబడి వస్తే గిట్టుబాటు అవుతుందని ఆశించారు. గతంలో సగటు ధర కిలోకు రూ.170, రూ.180, రూ.190గా ఉండేది. అయితే కొద్దిరోజులుగా గ్రేడ్–1 పొగాకుకు ధర పెరగడంతో సగటు ధర కూడా పెరుగుతూ వస్తోంది. దీంతో ఎస్ఎల్ఎస్ పరిధిలో సగటు ధర రూ.200 మార్కును దాటి ప్రస్తుతం ఇది రూ.209గా కొనసాగుతోంది. ఇదే పంథా కొనసాగితే సగటు ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు.

సన్న, చిన్నకారు రైతులకు ఊరట : ఎస్ఎల్ఎస్ ఏరియా పరిధిలోని సన్న, చిన్నకారు రైతులకు ఈ ఏడాది వేలం ఆశాజనకంగా ఉంది. మొదట్లో ధరల విషయంలో కొంత అసంతృప్తిగా ఉన్నా ఈ నెల రెండో వారం నుంచి వేలం ఊపందుకుంది. వ్యాపారుల్లో పోటీతత్వం పెరగడంతో గ్రేడ్–1 పొగాకుతోపాటు మిగిలిన రకాలకు మంచి ధర లభిస్తోంది.

మార్కెట్‌లో నిల్వలు తగ్గడంతో..

దేశీయ అవసరాలతో పాటు ఎగుమతులకు సైతం వర్జీనియా పొగాకుకు డిమాండ్ ఉండటంతో ధర రాకెట్‌లా దూసుకుపోతోంది. దేశీయంగా వర్జీనియా పొగాకు నిల్వలు లేకపోవడం, అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా నిల్వలు తగ్గడంతో డిమాండ్ పెరిగి గరిష్ఠ ధర లభిస్తోంది. సహజంగా పొగాకు కంపెనీలు రెండేళ్లకు సరిపడా నిల్వలు ఉంచుకుంటాయి. అయితే ఈసారి దేశీయంగా నిల్వలు నిండుకున్నాయి. అలాగే విదేశాల్లో కూడా నిల్వలు నిండుకోవడంతో ఎగుమతులకు డిమాండ్ పెరిగింది. దీంతో అన్ని కంపెనీలకు ఎగుమతులు ఆర్డర్లు రావడంతో పోటీపడి కొనుగోలు చేస్తున్నాయి. ఇదిలా ఉంటే ఎస్ఎల్ఎస్ (ఉత్తర ప్రాంత తేలిక నేలలు) పొగాకుకు మంచి పేరు ఉంది. సిగరెట్ల తయారీలో దీనిని సుగంధ ద్రవ్యంగా వినియోగిస్తారు.

ధరలు ఇలా..

వేలం కేంద్రం	అత్యధిక ధర (కిలోకు రూ.)
దేవరపల్లి	280
గోపాలపురం	279
కొయ్యలగూడెం	277
జంగారెడ్డిగూడెం–2	276
జంగారెడ్డిగూడెం–1	275

డిమాండ్ పెరగడంతో..



పొగాకుకు డిమాండ్ పెరగడంతో గరిష్ఠ ధర లభిస్తోంది. అయితే ఈ ధరలు చూసి బ్యారన్‌లు, భూముల లీజు ధరలు పెంచితే దీని ప్రభావం వచ్చే సీజన్‌పై పడుతుంది. రైతులు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.
– ఎం.ఆదిశేషయ్య, రీజినల్ మేనేజర్, వర్జీనియా పొగాకు బోర్డు

ఇంకా పెరిగే అవకాశం



ఎస్ఎల్ఎస్ ఏరియా పరిధిలో ప్రస్తుతం సగటు ధర రూ.209 నమోదైంది. ఇది ఇంకా పెరుగుతుందని ఆశిస్తున్నా. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలకు అనుగుణంగా సగటు ధర రూ.240 లభిస్తే రైతులకు లాభసాటిగా ఉంటుంది.
– కాకర్ల నంది, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు, కొయ్యలగూడెం

చాలా ఆనందం



వర్జీనియా ధరలు చూసి రైతులు ఆనందంగా ఉన్నారు. ప్రస్తుత మార్కెట్‌ను చూస్తే కిలో అత్యధిక ధర రూ.300కు చేరే అవకాశాలు ఉన్నాయి. సగటు ధర కూడా ఎన్నడూ లేనంత పెరగడంతో రైతులు నష్టాల నుంచి గట్టెక్కుతారు.
– పరిమి రాంబాబు, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు, జంగారెడ్డిగూడెం

నరసాపురం ఆస్పత్రిలో సేవలు ప్రారంభం



100 పడకల ఆస్పత్రి వద్ద అధికారులతో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం: నరసాపురంలో రూ.18 కోట్లతో ఆధునికీకరించిన 100 పడకల ఏరియా ఆస్పత్రి కొత్త భవనంలో వైద్య సేవలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గతేడాది నవంబర్‌లో సీఎం జగన్ ఆస్పత్రిని లాంఛనంగా ప్రారంభించారు. పాత భవనం నుంచి పూర్తిగా అన్ని వైద్యసేవలను కొత్త భవనంలోకి మార్పుచేశారు. దీనికి సంబంధించి షిఫ్టింగ్ పనులను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పరిశీలించి వైద్య సేవలను ప్రారంభించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులతో సమావేశం నిర్వహించారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో ఆస్పత్రి భవనాలను రూ.47 కోట్లతో ఆధునికీకరించామన్నారు. పట్టణంలోని ప్రధాన ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశామని, పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమిస్తామన్నారు. నరసాపురం, కాళీపట్నంలో కొత్తగా పీహెచ్‌సీలను నిర్మించామన్నారు. ఒక్కో కేంద్రానికి రూ.2.80 కోట్ల చొప్పున వెచ్చించామన్నారు. ఏరియా ఆస్పత్రిలో రీహేబిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని, బ్లడ్‌బ్యాంకును అందుబాటులోకి తెచ్చామని, త్వరలో కిడ్నీ డయాలసిస్ యూనిట్ కూడా ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ త్రిమూర్తులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ నేతలు ఉన్నారు.

దేవాలయాల్లో సంస్కరణలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆలయాల్లో అన్నిరకాలుగా సంస్కరణలు తీసుకువచ్చి ప్రక్షాళన చేస్తున్నామని దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని బలుసులమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు జరిపిస్తూనే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఆలయంలో అన్నదానాలకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్నిరకాల ఆలయాల్లో సిబ్బందిని రొటేషన్ పద్ధతిలో మూడు నెలలకోసారి వారు నిర్వహిస్తున్న శాఖను మారుస్తూ కొత్తవారికి అవకాశం ఇవ్వడం ద్వారా ఎవ్వరూ ఎక్కడా పాతుకుపోకుండా చూస్తున్నామన్నారు. ఆలయ సిబ్బంది లంచాలు తీసుకోకుండా ఉండేందుకు గాను రొటేషన్ పద్ధతిలో మార్పు చేస్తున్నామన్నారు. అంతేగాక సిబ్బంది పనితీరుపై సర్వీసు రికార్డుల్లో నమోదు ఉంటుందని, విధుల్లో అలసత్వం వహిస్తే రిమార్కు పడుతుందన్నారు.

27న 'నిధి ఆప్‌కే నికత్'

సాక్షి, భీమవరం: భీమవరంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ డిస్ట్రిక్ట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ (రాజమహేంద్రవరం) వైడీ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఫిర్యాదులు ఎలా చేయాలి, డిజిటల్ సేవలపై అవగాహన కల్పిస్తామని శ్రీనివాస్ పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే 'జగనన్న సురక్ష' లక్ష్యం

మంత్రులు కొట్టు, కారుమూరి



తాడేపల్లిగూడెంలో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తణుకులో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రంలోని ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని, అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిలో సీఎం జగన్ శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించగా తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం నుంచి మంత్రి కొట్టు వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఫిర్యాదులు స్వీకరించాలని, వాటిని పరిష్కరించే దిశగా కృషిచేస్తామన్నారు. మండలానికి రెండు బృందాలు, పట్టణాలకు మూడు బృందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 30 రోజులపాటు జరిగే కార్యక్రమంలో తొలి ఏడు రోజులు ఫిర్యాదులు సేకరిస్తారన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో నాలుగేళ్లలో రూ.2.16 లక్షల కోట్లను డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం అందజేసిందని అన్నారు.

ప్రజలకు మరింత చేరువగా..

తణుకు అర్బన్: అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సీఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తణుకు మున్సిపల్ కార్యాలయం నుంచి ఆయన వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత ఉండి పథకం అందలేదనే వారు లేకుండా చూడాలనే తపనతో సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. శనివారం శిక్షణ అనంతరం నెల రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి గడపలోకి వలంటీరు, సచివాలయ సెక్రటరీలు, గృహసారథులు, కన్వీనర్లు వెళ్లి సమాచారాన్ని సేకరిస్తారన్నారు. అలాగే జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు 11 సేవలను ఉచితంగా అందిస్తారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్రాత్మకమని, చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ పాల్గొన్నారు.

పకడ్బందీగా అమలుచేయాలి



కలెక్టరేట్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సీఎం జగన్ జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమాన్ని భీమవరం కలెక్టరేట్ నుంచి ఆమె వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు మండలంలో పర్యటించాలని, పక్కా ప్రణాళికతో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. అర్హులకు నాణ్యమైన సేవలందించాలన్నారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించాలన్నారు. ప్రతి కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లడం, రిజిస్ట్రేషన్లు చేయడం, ఎప్పటికప్పుడు డేటా ఇవ్వడం వంటి అంశాలను పరిశీలించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి




కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)–2024కు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్ఎస్ఆర్–2024పై నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఓట్లను పరిశీలించాలని, ఒకే డోరు నంబర్‌లో 10 ఓట్లు మించి ఉంటే తప్పనిసరిగా పరిశీలన చేయాలని ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారిని, చనిపోయిన వారు ఉంటే గుర్తించి భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓట్లను తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లు తనిఖీలు చేయాలని లోపాలుంటే మరో స్టేషన్ కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయిన తర్వాత ముసాయిదా ఎన్నికల జాబితా తయారవుతుందన్నారు. జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర అధికారులు కూడా వస్తారని ప్రతి కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా హాజరై పూర్తిస్థాయిలో నివేదికలను పంపాలన్నారు. జిల్లాలోని 636 జగనన్న లేఅవుట్లలో మిగిలిన 29లో ప్రోగ్రెస్‌లో ఉన్న 20 లేఅవుట్లలో లెవెలింగ్ పనులు నెలాఖరులోపు పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ఆర్డీఓ దాసిరాజు, వివిధ పార్టీల నాయకులు కామన నాగేశ్వరరావు, కోనాల భీమారావు, జేఎస్వీ గోపాలం, బి.వాసుదేవరావు, తోట గంగరాజు, మరపట్ల శ్యాబాంబు, మార్నిడి బాబ్జీ, నియోజక వర్గ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

'విద్యుత్' పునర్విభజన

- డివిజన్లు యథాతథం.. సెక్షన్లు మార్పు
- పరిపాలనా సౌలభ్యం కోసమే విభజన
- ఏలూరు విద్యుత్ సర్కిల్‌లో నూతన సెక్షన్లు
- మరికొన్ని సెక్షన్ల బదలాయింపు



సాక్షి ప్రతినిధి,ఏలూరు: రాష్ట్రంలో నూతన జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో పరిపాలనా సౌలభ్యం కోసం తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) ఆపరేషన్ సర్కిళ్లను విభజిస్తూ సంస్థ జీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గతంలో ఐదు సర్కిళ్లుగా ఉన్న ఈపీడీసీఎల్ డిస్కమ్ 11 జిల్లాలుగా ఆవిర్భవించనుంది. దీనిలో భాగంగా ఏలూరు ఆపరేషన్ సర్కిల్‌ను ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలుగా విభజించారు. అయినా సాంకేతికంగా ప్రస్తుతం ఏలూరు ఆపరేషన్ సర్కిల్‌గానే తన కార్యకలాపాలు నిర్వహిస్తూ వస్తోంది. కొన్ని డివిజన్ల పరిధులను విలీనం చేయడంలో తలెత్తే ఇబ్బందుల దృష్ట్యా ప్రస్తుతం జిల్లాల విభజన పూర్తి కాలేదు. ఇదిలా ఉండగా సీఎండీ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని కొన్ని పెద్ద సెక్షన్లను విభజించగా, తాడేపల్లిగూడెం డివిజన్‌లోని కొన్ని సెక్షన్లను ఏలూరు, నిడదవోలు డివిజన్లకు బదలాయించారు.

కొత్తగా ఏర్పడిన సెక్షన్లు

- ఏలూరులో ఇప్పటికే డీ–1, డీ–2, డీ–3, డీ–4 సెక్షన్లు ఉండగా వాటిలో డీ–4 సెక్షన్‌ను డీ–4, డీ–5 సెక్షన్లుగా విభజించారు.
- ఏలూరు డీ–4 సెక్షన్‌కు 16,496 సర్వీసులను, డీ–5 సెక్షన్‌కు 19,101 సర్వీసులను కేటాయించారు.
- ఆకివీడు సెక్షన్‌ను ఆకివీడు టౌన్, రూరల్ సెక్షన్లుగా విభజించారు. ఆకివీడు టౌన్ సెక్షన్‌కు 19,120 సర్వీసులు, రూరల్ సెక్షన్‌కు 10,576 సర్వీసులు కేటాయించారు.
- ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని టి.నరసాపురం సెక్షన్‌ను రెండుగా విభజించి టి.నరసాపురం, బొర్రంపాలెం సెక్షన్లుగా ఏర్పాటుచేశారు. టి.నరసాపురం సెక్షన్‌కు 16,571 సర్వీసులు, బొర్రంపాలెం సెక్షన్‌కు 9,082 సర్వీసులు కేటాయించారు.

సెక్షన్ల బదలాయింపు ఇలా..

ఏలూరు సర్కిల్ పరిధిలోని తాడేపల్లిగూడెం డివిజన్‌లో గతంలో మొత్తం 16 సెక్షన్లు ఉండగా వాటిలో 5 సెక్షన్లను ఇతర డివిజన్లకు బదలాయించారు. ఈ డివిజన్‌లోని నల్లజర్ల, అనంతపల్లి సెక్షన్లను నిడదవోలు డివిజన్‌లోకి బదలాయించారు. ఇప్పటికే నిడదవోలు డివిజన్‌ను రాజమండ్రి సర్కిల్ పరిధిలోకి మార్చడంతో నల్లజర్ల, అనంతపల్లి సెక్షన్లు రాజమండ్రి సర్కిల్‌లోకి మారినట్లయ్యింది. దీంతో నల్లజర్ల సెక్షన్ పరిధిలోని 18,382 సర్వీసులు, అనంతపల్లి సెక్షన్ పరిధిలోని 16,172 సర్వీసులు రాజమండ్రి సర్కిల్‌లోకి వెళ్లాయి. అలాగే తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని చేబ్రోలు, గొల్లగూడెం, నిడమర్రు సెక్షన్లను ఏలూరు డివిజన్‌లోకి బదలాయించారు. దీంతో చేబ్రోలు సెక్షన్‌లోని 17,591 సర్వీసులు, గొల్లగూడెం సెక్షన్‌లోని 13,470 సర్వీసులు, నిడమర్రు సెక్షన్‌లోని 18,581 సర్వీసులు ఏలూరు డివిజన్‌లోకి వచ్చి చేరాయి.

నిరంతర సరఫరాపై దృష్టి



విద్యుత్ సంస్థలో పునర్విభజన చర్యలు ప్రారంభమయ్యాయి. పునర్విభజన పనులు ఎలా ఉన్నా ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేస్తున్నారు. ముఖ్యంగా జగనన్న లే అవుట్లలో వేగవంతంగా విద్యుదీకరణ పనులు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాం. అలాగే రానున్న వర్షాకాలంలో ఎటువంటి విపత్తులు సంభవించినా సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం.
– పి.సాల్మన్‌రాజు, ఈపీడీసీఎల్ ఎస్ఈ, ఏలూరు

క్లుప్తంగా

గ్రామీణ నీటి సరఫరాపై సమీక్ష


గ్రామీణనీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు(మెట్రో) : మంచినీటి సరఫరా పనులను నాణ్యతతో నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులకు సూచించారు. గ్రామీణ నీటి సరఫరాపై చైర్‌పర్సన్ చాంబర్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ మంచినీటి సరఫరా పనుల పురోగతిపై ఆరా తీశారు. సీపీడబ్ల్యూఎస్ పథకం కింద జరుగుతున్న పనులపై సమీక్షించారు. పనుల నాణ్యతపై రాజీపడొద్దని సూచించారు. బిల్లుల పేమెంట్, కరెంట్ చార్జీల చెల్లింపుల తీరుతెన్నులను పరిశీలించారు. సమీక్ష సమావేశంలో సీఈఓ కేవీఎస్ఆర్ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, భీమవరం ఇంజినీరింగ్ ఆఫీసర్, కొవ్వూరు ఈఈ, ఏలూరు, కొవ్వూరు, భీమవరం, రాజమండ్రి డీఈలు పాల్గొన్నారు.

శ్రీవారి ట్రస్టుకు రూ.3.05 లక్షల విరాళం


దాత కుటుంబ శాస్త్రికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా శుక్రవారం రూ.3,05,000లు విరాళంగా అందజేశారు. అందులో భాగంగా తాడేపల్లిగూడెంకు చెందిన కలవచర్ల కుటుంబ శాస్త్రి రూ. 2,05,000, హైదరాబాద్‌కు చెందిన పున్నమరాజు వెంకట సత్యనారాయణ రూ.1,00,000లు నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు, అన్నదాన కార్యాలయ గుమస్తా బన్నీ విరాళం బాండ్ పత్రాలను అందించారు.

వానాకాలం.. వ్యాధుల భయం

- వాతావరణం మారడంతో అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా వచ్చే అవకాశం
- జిల్లాలో 133 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు
- మొదటి విడత స్ప్రేయింగ్ ప్రారంభం

బుట్టాయగూడెం: వర్షాకాలం వచ్చిందంటే చాలు వ్యాధుల భయం మొదలవుతుంది. వాతావరణంలో మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని లేదంటే పలు రోగాల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. నీటి కలుషితం ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మురికి నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెందుతాయని వైద్యాధికారులు అంటున్నారు. వర్షాకాల సమయంలో గిరిజన ప్రాంతంలో ఎక్కువగా వాతావరణ మార్పుల వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా, కామెర్లు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. చిన్న లక్షణం కనిపించినా వెంటనే అందుబాటులో ఉన్న ప్రభుత్వాస్పత్రులకు వెళ్ళాలని చికిత్స పొందాలని సూచిస్తున్నారు.

జిల్లాలో 133 మలేరియా సమస్యాత్మక గ్రామాలు

జిల్లాలోని గిరిజన మండలాలైన పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో సుమారు 133 మలేరియా వ్యాప్తి చెందే సమస్యాత్మక గ్రామాలను అధికారులు గుర్తించారు. గతంలో 172 సమస్యాత్మక గ్రామాలు ఉండగా దోమల నివారణకు మలేరియా అధికారులు చేపట్టిన చర్యలతో 39 గ్రామాల్లో మలేరియా వ్యాప్తి బాగా తగ్గింది. మిగిలిన 133 గ్రామాల్లో మలేరియా నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో ప్రస్తుతం మొదటి విడత మలేరియా స్ప్రేయింగ్ పనులు జూన్ 1 నుంచి ప్రారంభించారు. ఇందుకోసం 20 టన్నుల మలాథియన్ స్ప్రేయింగ్ మందు డబ్బాలు సిద్ధం చేశారు. ఇంతవరకూ 120 గ్రామాల్లో మొదటి విడత పనులు పూర్తయినట్లు అధికారులు చెప్పారు. మిగిలిన గ్రామాల్లో కూడా పూర్తి చేసి జులై 15 నుంచి 2వ విడత మలాథియన్ స్ప్రేయింగ్ పనులకు ఏర్పాట్లు చేస్తున్నారు.


ఏజెన్సీలో మలాథియన్ స్ప్రేయింగ్ పనులు



గత ఏడాది 2,52,417 దోమతెరలు పంపిణీ

దోమల నివారణలో భాగంగా సుమారు 22 పీహెచ్‌సీల పరిధిలో ప్రజలకు సుమారు 2,52,417 దోమతెరలు పంపిణీ చేశారు. ఈ దోమతెరలను నాలుగేళ్ల పాటు ప్రజలు వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం దోమతెరల వినియోగంపై గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అవగాహన కలిగిస్తున్నారు.

టైఫాయిడ్

కలుషిత నీటిని తాగడం వల్ల, బహిరంగ మలవిసర్జన వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. జ్వరం త్వరగా తగ్గకపోవడం, ఒంటి నొప్పులు, తలనొప్పి, కడుపులో అల్సర్‌లు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలి. సురక్షిత నీటిని తాగడం, జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని వైద్యం పొందడం ద్వారా నయం కావచ్చు.

మలేరియా

ఎనాఫిలస్ అనే దోమ కుట్టడం ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుంది. వైవాక్స్ మలేరియా, ఫాల్సీ ఫారమ్ మలేరియా అనే రెండు రకాలు ఉన్నాయి. ఇందులో రెండో రకం అత్యంత ప్రమాదకరమైంది. జ్వరం వచ్చినప్పుడు టెస్ట్‌లు చేయించుకుని సకాలంలో చికిత్స చేయించుకోకపోతే రోగి చనిపోయే ప్రమాదం ఉంది. తీవ్రమైన జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం, తీవ్రమైన తలనొప్పి ఉంటే అవి మలేరియా లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం. మురికినీరు నిల్వలేకుండా చూసుకోవడం. దోమల నివారణకు చర్యలు తీసుకోవడం వంటి పనులు చేయాలి.

డయేరియా

కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వస్తుంది. ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతుంది. ఆగకుండా విరోచనాలు, వాంతులు కావడం ఈ వ్యాధి లక్షణాలు. డయేరియా నివారణకు వైద్యులు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తారు. సురక్షిత, కాచి చల్లార్చిన నీటిని తాగాలి. పులుపు, కారం ఉండే ఆహారాన్ని తగ్గించడం, ఫాస్ట్ ఫుడ్ వంటివి తినకపోవడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే వైరల్ జ్వరాలు కూడా సోకే ప్రమాదముందని, అనారోగ్యంగా ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలంలో వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇళ్ల చుట్టూ వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి.

– ఎస్ఎస్ఎస్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి, కేఆర్‌పురం

మొదటి విడత స్ప్రేయింగ్ పనులు ప్రారంభించాం



మలేరియా సమస్యాత్మక గ్రామాల్లో మొదటి విడత స్ప్రేయింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు పర్యవేక్షణలో పనులు చేస్తున్నాం. జులై 15వ తేదీ నుంచి రెండో విడత స్ప్రేయింగ్ పనులు జరుగుతాయి.

– పి.పెద్దిరాజు, సబ్ యూనిట్ ఆఫీసర్, బుట్టాయగూడెం

వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి



వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా జ్వరం వస్తే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

– ఎస్ఎస్‌వి ప్రవీణ్, దొరమామిడి ప్రభుత్వాస్పత్రి వైద్యుడు, బుట్టాయగూడెం మండలం

సజ్జలను కలిసిన చింతలపూడి ఎత్తిపోతల రైతులు


సజ్జల రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతులు

చింతలపూడి : చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతుల సమస్యలను పరిష్కరించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్వాసిత రైతులు ప్రభుత్వ గౌరవ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గురువారం మంగళగిరిలో ఆయన కార్యాలయంలో కనమతరెడ్డి క్రాంతికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎత్తిపోతల పథకం పూర్తిచేయడంతో పాటు రైతులకు ఇచ్చే పరిహారం విషయంలో న్యాయం చేయాలని కోరారు. గడువు లోగా కాలువ పనులు పూర్తిచేసి మెట్ట ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. రైతుల సమస్యలను తెలుసుకున్న రామకృష్ణారెడ్డి ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని, రైతులకు న్యాయం జరిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సజ్జలను రైతులు సత్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గోలి రామకృష్ణారెడ్డి, గన్నమనేని వాసు, వనమాల కృష్ణారావు, చిట్లూరి అంజిబాబు, ధర్మలింగంతో పాటు, టి.నరసాపురం, బొర్రంపాలెం, చింతలపూడి, సుబ్బారాయుడుగూడెం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల పంపిణీని అడ్డుకోవడంపై నిరసన

తిరుమలంపాలెంలో లబ్ధిదారుల ఆందోళన


ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

ద్వారకాతిరుమల : ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను వెంటనే తమకు అప్పగించాలంటూ తిరుమలంపాలెంకు చెందిన లబ్ధిదారులు గ్రామంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి శుక్రవారం ఆందోళన చేశారు. అనంతరం మండల రెవిన్యూ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ పొట్టూరి సతీష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలోని తిరుమలంపాలెంలో సుమారు 136 మంది లబ్ధిదారులకు 2020లో ప్రభుత్వం ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. అందులో భాగంగా ఆర్ఎస్ నంబర్ 121 లోని 9.77 ఎకరాల భూమిలో, 3.85 ఎకరాల భూమిని పంపిణీకి కేటాయించింది. దీనిపై అప్పట్లో గ్రామానికి చెందిన సుంకవల్లి రాంబాబు హైకోర్టును ఆశ్రయించి స్థలాల పంపిణీని అడ్డుకున్నారు. అదే రాంబాబు 2022 నవంబర్‌లో తాను వేసిన పిటీషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. దాంతో తాజాగా రెవిన్యూ అధికారులు లబ్ధిదారులకు పట్టాలను మంజూరు చేశారు. అలాగే స్థలాలకు సరిహద్దులు చూపించే పనిలోపడ్డారు. ఇదిలా ఉంటే పది రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన సుంకవల్లి సతీష్ తన పొలానికి వెళ్లేందుకు దారి లేదంటూ హైకోర్టును ఆశ్రయించి స్టేటస్ కో ఆర్డర్ పొందాడు. దాంతో కథ మళ్లీ మొదటికి రావడంతో లబ్ధిదారులు ఆగ్రహానికి గురయ్యారు. ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్న ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ లబ్ధిదారులను బుజ్జగించారు. దాంతో ఆందోళన విరమించిన వారంతా మండల రెవిన్యూ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వాస్తవానికి పొలాలకు వెళ్లేందుకు దారి విడిచిపెట్టి అధికారులు లేఅవుట్ వేశారని, అయినా స్థలాల పంపిణీని జరగనివ్వడం లేదని లబ్ధిదారులు ధ్వజమెత్తారు. కావాలనే స్థలాల పంపిణీని అడ్డుకుంటున్నారని, వెంటనే రెవెన్యూ అధికారులు తమ స్థలాలకు సరిహద్దులు చూపాలని డిమాండ్ చేశారు.

గడపగడపకు సంక్షేమం


తణుకు అర్బన్ : 17వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అవ్వకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఆర్టీసీ దూరప్రాంత ప్రయాణికులకు రాయితీ

జిల్లా ప్రజా రవాణా అధికారి వర ప్రసాద్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి వర ప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ బస్సుల్లో దూరప్రాంతాలకు ప్రయాణం చేసేవారికి టిక్కెట్ ధరలో రాయితీ ఇస్తున్నట్లు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి వంటి దూరప్రాంతాలకు ప్రయాణించే వారు ముందుగా రాను, పోను టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకుంటే టిక్కెట్ ఛార్జీలపై రాను 10 శాతం, పోను 10 శాతం రాయితీ లభిస్తుందన్నారు. గతంలో కేవలం తిరిగి వచ్చేటప్పుడు మాత్రమే పది శాతం రాయితీ వచ్చేదన్నారు. జూలై 3వ తేదీన గురు పౌర్ణమి సందర్భంగా ఏలూరు జిల్లా నుంచి అరుణాచలం వెళ్ళే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామని, ఏలూరు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి ఇప్పటికే ఒక్కొక్క బస్సు రిజర్వేషన్ పూర్తి అయిందన్నారు. భక్తుల సౌకర్యం కోసం మరిన్ని బస్సులను అందుబాటులో ఉంచుతామన్నారు. ఆషాఢ పూర్ణిమ సందర్భంగా అంతర్వేదిలో సముద్ర స్నానానికి వెళ్ళే భక్తుల కోసం కూడా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామని, ఈ బస్సులు అంతర్వేది వద్ద సముద్ర స్నానం అనంతరం అంతర్వేది ఆలయ దర్శనం, అక్కడి నుంచి అప్పనపల్లి, అనంతరం భీమవరం మావుళ్ళమ్మ అమ్మవారి దర్శనాలకు భక్తులను తీసుకువెళ్ళి తీసుకువస్తాయన్నారు. విద్యార్థులకు రాయితీతో కూడిన బస్ పాసులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో రోడ్లు, ట్రాఫిక్ పరిస్థితులపై తమ డ్రైవర్లకు అవగాహన కలిగించడానికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కమర్షియల్ జీఎల్‌పీవీ సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో ఆర్టీసీ కార్గో ఆదాయం పెంచడం కోసం కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆర్టీసీ పీఆర్‌ఓ కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు.

ఆర్టీసీలో 10 శాతం రాయితీ

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం దూరప్రాంత సర్వీసులకు రాను పోను చార్జీలలో పది శాతం చొప్పున రాయితీ ఇస్తున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.వీరయ్య చౌదరి తెలిపారు. ప్రయాణికులు ఒకేసారి టికెట్లు బుక్ చేసుకుంటే ఈ సౌకర్యం వర్తిస్తుందన్నారు.

కాపులకు ప్రతినిధినని ముద్రగడకు గర్వం

మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య



పాలకొల్లు సెంట్రల్: కాపులకు తానే ప్రతినిధినని, తానొక్కడినే నాయకుడినని ముద్రగడ పద్మనాభం గర్వంతో విర్రవీగుతున్నారని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య అన్నారు. ఇన్నేళ్లలో తన పక్కన ఎవరినీ ఎదగనివ్వని నాయకుడు ముద్రగడ అని చెప్పారు. శుక్రవారం పాలకొల్లులోని తన నివాసంలో జోగయ్య మాట్లాడుతూ రంగా హత్యానంతరం జరిగిన ఆందోళనల్లో క్రిమినల్ కేసులు పెడితే వారిపై కేసులు తొలగించడానికి తనతో పాటు నల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి వచ్చారని, ఇద్దరం కలిసి 18 రోజులు నిరాహార దీక్షలు చేశామన్నారు. విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా కాపుల రిజర్వేషన్ విషయం తేల్చాలని కిర్లంపూడిలో ఇంటిలో తలుపులు వేసుకుని రివాల్వర్ దగ్గర పెట్టుకుని ముద్రగడ హడావుడి చేశారన్నారు. నాడు రోశయ్య, వంకా సత్యనారాయణ, తాను కలిసి ముద్రగడ వద్దకు వెళ్లామన్నారు. జీవో 30 అమలు చేసి రిజర్వేషన్లు కల్పించడానికి విజయభాస్కర రెడ్డి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. కొందరు కోర్టుకు వెళ్లడంతో ఆ జీవో మధ్యలోనే ఆగిపోయిందని చెప్పారు. పిఠాపురంలో తనపై పోటీ చేయమని పవన్‌కు సవాల్ చేస్తున్నాడని, ఆయనపై పోటీచేయడానికి జనసేన సామాన్య కార్యకర్త సరిపోతాడని జోగయ్య తెలిపారు. కాపులు, బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే కమ్మ, రెడ్డి కులాల ప్రాతినిధ్యం తగ్గించాలని అన్నారు. ఎన్ని పోరాటాలు చేసినా కాపులను బీసీల్లో చేర్చడం లేదని, రిజర్వేషన్లు కల్పించడం లేదని చెప్పారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య


మృతుడు పూడి లక్ష్మణరావు(45)

పోలవరం రూరల్: అప్పుల బాధ భరించలేక తాపీమేస్త్రీ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలవరం పంచాయతీలోని కృష్ణారావుపేటకు చెందిన పూడి లక్ష్మణరావు (45) గురువారం రాత్రి పురుగులమందు తాగాడు. హుటాహుటిన పోలవరం వైద్యశాలకు తరలించగా, ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం చాగల్లుకు తరలించగా, అక్కడ మృతిచెందినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్ కుమార్ తెలిపారు. భార్య పూడి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుమారు రూ.18 లక్షల వరకు అప్పులు చేసినట్లు ఎస్సై తెలిపారు. అప్పుల బాధ భరించలేక మృతిచెందినట్లు ఆయన పేర్కొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

సెప్టిక్ ట్యాంకుల్లోని వ్యర్థాలు డ్రైనేజీల్లోకి

శ్రీవారి కొండపై దారుణం


శ్రీవారి కొండపైన దేవస్థానం సిబ్బంది క్వార్టర్స్ నుంచి పైప్ ద్వారా డ్రైనేజీల్లోకి సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన దేవస్థానం సిబ్బంది నివసించే క్వార్టర్స్‌లోని సెప్టిక్ ట్యాంకులు నిండిపోవడంతో వాటిలోని వ్యర్థాలను మోటర్‌తో తోడి అక్కడున్న డ్రైనేజీల్లోకి వదిలేశారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణి కారణంగా పవిత్ర ప్రదేశంలో దుర్వాసన వస్తుంది. భక్తులు అధికంగా సంచరించే ప్రాంతంలో పట్టపగలు ఇలాంటి పనులు చేయడం ఏమిటని అధికారుల తీరుపై యాత్రికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా సెప్టిక్ ట్యాంకులను తోడించి, దూర ప్రాంతాలకు తరలించేందుకు సెప్టిక్ ట్యాంక్ వాహనాలను వినియోగిస్తాం. చినవెంకన్న దేవస్థానంలో మాత్రం అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ తీరు అందుకు భిన్నంగా ఉంది. భక్తుల ఆరోగ్యాన్ని గాలికొదిలి సెప్టిక్ ట్యాంకులలోని వ్యర్థాలను దర్జాగా డ్రైనేజీల్లోకి విడిచిపెట్టేశారు. దాంతో భక్తులు అటుగా ముక్కు మూసుకుని సంచరించాల్సి వచ్చింది. ఈ ప్రాంతానికి సమీపంలో ఒక పక్క నిత్యాన్నదాన భవనం, మరో పక్క చిల్డ్రన్స్ పార్క్, కాటేజీలు ఉన్నాయి. నిత్యం ఎంతో మంది అధికారులు తిరిగే ఈ ప్రాంతంలో ప్రజారోగ్యానికి భంగం కలిగేలా ఇలాంటి పనులు జరుగుతుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని.. కాంట్రాక్టరుకు కొమ్ము కాస్తున్నారా.. అని పలువురు భక్తులు ధ్వజమెత్తుతున్నారు. దీనిపై ఆలయ ఇన్‌చార్జ్ ఈఈ ఎం.విజయరాజును వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలిస్తానని తెలిపారు.

క్లుప్తంగా

శాకంబరి అలంకరణలో యల్లారమ్మ


శాకంబరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో వేంచేసియున్న యల్లారమ్మ అమ్మవారిని శాకంబరి అలకారంలో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారిని దాతలు, భక్తుల సహాయ, సహకారాలతో వివిధ కూరగాయలతో ప్రత్యేకంగా అలకరించారు. అమ్మవారితో పాటు ఆలయ ముఖ ద్వార మంటపం, గుమ్మాలను వివిధ కూరగాయలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల మణికంఠ, ఈవో ఎంవీ రామయ్యలతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ యాప్స్‌పై అవగాహన అవసరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాసవి జీఎంఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ ఆపరేషన్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ బి.వేణు గోపాలరావు హాజరై మాట్లాడుతూ బ్యాంక్‌లో డిపాజిట్లులో ఎన్ని రకాలున్నాయో, లోన్లు ఎన్ని రకాలు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్స్ ఏ విధంగా జాగ్రత్తగా చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వీవీఎస్ లక్ష్మీనారాయణ స్మార్ట్‌ఫోన్ వాడే యువత ఆన్‌లైన్ యాప్స్‌పై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ ఉపాధ్యాయులు గంగా ప్రసాద్, లెక్చరర్స్ దుర్గారావు, కాశిం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అదనపు పని భారాన్ని తగ్గించాలి

సాక్షి, భీమవరం: ఆశ కార్యకర్తలకు అదనపు పని భారాన్ని తగ్గించాలని ఏపీ వలంటరీ హెల్త్ వర్కర్స్ ఆశ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె పోసమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులను ఆసుపత్రికి తీసుకు వెళ్తున్నప్పుడు ప్రసవమయ్యే వరకు అక్కడే ఉండాల్సి వస్తుందని అటువంటి సమయంలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాలనుఅమలు చేయడంలో కింద స్థాయి అధికారులు వక్ర భాష్యాలు చెప్పి మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి దిగుపాటి జ్యోతి, ఎండీ బేగం, లారెన్స్ కుమారి, ఆదిలక్ష్మి, పద్మ, జానకి తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపుల రిజర్వేషన్లపై హద్దులు తొలగించాలి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో తూర్పుకాపులకు ఓబీసీ రిజర్వేషన్లపై హద్దులు తొలగించి అన్ని జిల్లాలకు వర్తించేలా కృషి చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవర్‌కు తూర్పుకాపు సంఘ సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. శుక్రవారం సంఘ సభ్యులు లోపింటి చిరంజీవి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్‌సీబీసీ కమిషన్ కోరిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమైందని విద్యార్థులు ఓబీసీ సర్టిఫికెట్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మీసాల రాము, పిల్లా సత్తిబాబు, సామంతుల అప్పారావు, పాట్నూరి రమేష్, చీరా సత్తిబాబు, దేవి కిషోర్, భాకూరి నిరంజన్, ధనాని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లేసుపార్కులో ఉచిత శిక్షణ తరగతులు

నరసాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా అందించనున్న ఉచిత శిక్షణలను వినియోగించుకోవాలని లేసుపార్కు మేనేజర్ డి.వెంకటేశ్వరరావు, ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వసంతరావు పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ)ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిక్షణకు లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. నరసాపురం మండలం సీతారాంపురం లేసుపార్కులో 60 మంది ఔత్సాహిక మహిళలకు రెండు బ్యాచ్‌లుగా కుట్టు మిషన్, హ్యాండ్ ఎంబ్రాయిడరీలపై శిక్షణను ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో లేసు పార్కు అధ్యక్షురాలు పులపర్తి మహాలక్ష్మి, పాలంకి రమేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- 23వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం


23వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని, సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పట్టణంలో 23వ వార్డులో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలన్నది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యేగా తాను తన ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించడం తన బాధ్యత అన్నారు. అన్యాయంగా ప్రజలను మోసం చేసి తెదేపా నాయకులు కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి ఆదర్శవంతమైన పాలన అందిస్తుంటే దానిపై విమర్శలు చేయడం తగదన్నారు. హలో ఏపీ బైబై వైఎస్సార్ అనడం అతని బుర్ర తక్కువ తనాన్ని వెల్లడిస్తుందన్నారు. భవిష్యత్తులో మళ్లీ ప్రజలను మోసం చేసి అధికారం చేజిక్కించుకొనేందుకు చంద్రబాబు కుయుక్తులు చేస్తున్నాడన్నారు. రాబోయే రోజుల్లో సంక్షేమ పాలన కోరుకునే ప్రజలందరూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని నిలిపాలన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, మున్సిపల్ ఇంజినీర్ మురళీకృష్ణ, నాయకులు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, పట్నాల లక్ష్మీ గణపతి, దాసి బాబు, వట్టి బుజ్జి, మిద్దే ఆదినారాయణ, హరిదాసుల రవీంద్రకుమార్, బోణ విజయనిర్మల పాల్గొన్నారు.

ఇంటింటా నవరత్నాల వెలుగులు

- పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- 17వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


తణుకు 17వ వార్డులో మహిళకు సంక్షేమ బ్రోచర్ అందజేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని, నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు నిండాయని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 17వ వార్డులో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గడప గడపలోను ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపలోను మళ్లీ జగనే రావాలి అంటూ ప్రజానీకం స్వాగతం పలుకుతున్న తీరు ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రతి ఇంట్లోను ఒక బిడ్డగాను, అన్నగాను, తమ్ముడిగాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దీవిస్తున్నారని చెప్పడానికి సంతోషంగా ఉందన్నారు. ఏ ఒక్క అర్హుడికి సంక్షేమం అందకుండా పోకూడదనే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తాపత్రయపడుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ఇంటి గుమ్మంలోకే అందించాలనే తపన కనిపిస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో పేదింట పెద్ద చదువులు అందుతున్నాయని, పేదవర్గాల కుటుంబాలు సైతం అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేసి ఎన్నో వసతులను రూపకల్పన చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి గడపలోను వారికి అందిన సంక్షేమంతో పాటు, ప్రభుత్వం అర్హులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను మంత్రి కారుమూరి స్వయంగా వివరించారు. మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నత్తా కృష్ణవేణి, 17వ వార్డు నాయకులు కట్టా కిషోర్, మండ సూరిబాబు, అడ్డగర్ల రామకృష్ణ, కర్రి కాశీరెడ్డి, తాటిపర్తి వాసు, కొమ్మోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం


అమ్మవారిని దర్శించుకుంటున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయాన్ని వైభవోపేతంగా భక్తులు సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆలయంలోని అమ్మవారిని శుక్రవారం మంత్రి దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత ఆలయ కమిటీ అర్చకులు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో మంత్రి కొట్టు సత్యనారాయణకు స్వాగతం పలికారు. ఆశీర్వచనాలు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ గ్రామ దేవత బలుసులమ్మ అమ్మవారికి వెండి కవచం సమకూర్చామన్నారు. అమ్మవారి ఊరేగింపునకు సుమారు 15 లక్షలతో వెండి పీఠం, తోరణంతో కూడిన టేకు రథం తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. రథం తయారీకి వెంకటగిరి గుంటూరు చేనేత వస్త్రాలయం అధినేత చప్పటి వెంకటేశ్వరరావు ఏడున్నర లక్షలు విరాళం, శ్రీ సెలక్షన్స్ అధినేతలు వై.రామప్రసాద్ అండ్ బ్రదర్స్ లక్షన్నర రూపాయిలు విరాళంగా ఇస్తున్నట్లు చెప్పారు. అమ్మవారికి సుమారు 30 కిలోలతో వెండి వాకిలి త్వరలో చేయించబోతున్నట్లు ప్రకటించారు. ఆలయ ప్రాంగణంలో కోటి రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. శాశ్వత ప్రాతిపదికన యాగశాల కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొట్టు రామాంజనేయులు మాట్లాడుతూ అమ్మవారికి రథం నిమిత్తం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు ప్రోద్బలంతో టేకు సమకూర్చారన్నారు. రోడ్డు ముఖద్వారంలో ఆర్చి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తొలుత ఆలయంలో జరిగిన అభివృద్ధి పనులను కొట్టు సత్యనారాయణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీజీఎఫ్ కమిటీ సభ్యులు కర్రి భాస్కరరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొలుకులూరి ధర్మరాజు, ఆలయ కమిటీ సభ్యులు వట్టిపోలు రాము, పెదప్రోలు భాస్కర్, గారపాటి వీరకుమార్, రంగనాయకులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

25న దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ


తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న శెట్టిబలిజ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యవరప్రసాద్

తణుకు అర్బన్: శెట్టిబలిజల జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణకు శెట్టిబలిజ జాతి అంతా కదలిరావాలని శెట్టిబలిజ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కంశెట్టి సత్యవరప్రసాద్ అన్నారు. తణుకు ఎన్టీఆర్ పార్కు ఆవరణలో ఈనెల 25వ తేదీన పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతుల మీదుగా నిర్వహించనున్న విగ్రహావిష్కరణ సందర్భంగా శుక్రవారం శ్రీరామా శెట్టిబలిజ సంఘం పాతవూరు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడుగులుగా పిలువబడే తమను శెట్టిబలిజగా నామకరణం చేసి సంఘాలుగా ఏర్పడడంలో కీలకభూమిక పోషించిన వెంకటరెడ్డి విగ్రహం తణుకులో ఏర్పాటు చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. 25వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న విగ్రహావిష్కరణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ శెట్టిబలిజ సంఘం పెద్దలు కుడుపూడి చంద్రరావు, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, కుడుపూడి వెంకటేశ్వరరావు, కేతా కొండయ్య, సానబోయిన సత్యనారాయణ, సానబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వనాథ్, పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

తాడేపల్లిగూడెం రూరల్: పాఠశాలల్లో ప్రభుత్వ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీవో విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే విద్యార్థుల బయోమెట్రిక్‌ను తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మొక్కలను పెంపకం చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈవోలు వి.హనుమ, పీఎంకే.జ్యోతి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి


పాలకోడేరు లో డ్రెయిన్ ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

పాలకోడేరు: వర్షాకాలం మొదలైంది కాబట్టి వైద్య సిబ్బంది గ్రామాల్లో అప్రమత్తంగా ఉండి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు అన్నారు. పాలకోడేరులో డ్రైడే -ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా తదితర జ్వరాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా వైద్య సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రంగం నాయుడు, ప్రకృతి వైద్యురాలు డాక్టర్ సుజన, సిహెచ్వో సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి

పాలకొల్లు అర్బన్: ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి అందించడంతో పాటు మంచినీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ వెల్లడించారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో జలజీవన్ మిషన్ నిధులు రూ.2.68 కోట్లతో విస్తరించనున్న పైపులైన్ పనులకు శుక్రవారం ఎమ్మెల్సీ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో మండలంలోని దగ్గులూరుతో పాటు ఆగర్తిపాలెం, కొత్తపేట, గవరపేట, పాలమూరు గ్రామాలకు పైపులైన్ విస్తరణ, ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం, సంపులు, ఇతర మరమ్మతుల పనులు చేపట్టనున్నట్లు శ్రీనివాస్ వివరించారు. పనుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసి ప్రజలకు మంచినీరు అందించాలని కోరారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులకు సమాన ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని మరలా సీఎం చేయాలని కోరారు. ఈ సందర్భంగా దగ్గులూరు మంచినీటి చెరువుగట్టు వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్సీ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జడ్పీటీసీ నడపన గోవిందరాజులనాయుడు, చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను జయప్రదం చేయండి


ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న దృశ్యం

ఇరగవరం: అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలో 21 గ్రామాల్లో శుక్రవారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమైందన్నారు. గ్రామాల్లోని సచివాలయల వద్ద అధికారులు, నాయకులు జగనన్న సురక్ష కార్యక్రమం, సీఎం జగన్ మోహన్ రెడ్డి సందేశం వీక్షించారు. ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందకుండా పోరాదు అనే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాంది పలికిందన్నారు. జులై 1వ తేది నుంచి 30 రోజులు పాటు జగనన్న సురక్ష కార్యక్రమం అమలు అవుతుందని తెలిపారు. అధికారులు, నాయకులు, వలంటీర్లు విధిగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, జెడ్పీటీసీ పంపన అంజి బాబు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సీఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తణుకు మున్సిపల్ కార్యాలయం నుంచి ఆయన వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత ఉండి పథకం అందలేదనే వారు లేకుండా చూడాలనే తపనతో సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. శనివారం శిక్షణ అనంతరం నెల రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి గడపలోకి వలంటీరు, సచివాలయ సెక్రటరీలు, గృహసారథులు, కన్వీనర్లు వెళ్లి సమాచారాన్ని సేకరిస్తారన్నారు. అలాగే జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు 11 సేవలను ఉచితంగా అందిస్తారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్రాత్మకమని, చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించాలి

తణుకు టౌన్: గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని ఎంపీపీ రుద్ర ధనరాజు కోరారు. శుక్రవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యక్ష కార్యక్రమాన్ని అధికారులు, నాయకుల ఆధ్వర్యంలో తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను అవసరమైన సేవలను నమోదు చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. జూలై 1 నుంచి జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వార్డు, గ్రామ సచివాలయాల వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. సురక్ష కార్యక్రమం ద్వారా అందించే సేవలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో పీ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


తణుకులో ఆణిముత్యంగా నిలిచిన విద్యార్థిని తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ఆణిముత్యంగా నిలిచి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 586 మార్కులతో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థిని ఎండీ సబీహకు పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆర్థికసాయం అందచేశారు. శుక్రవారం తణుకు మునిసిపల్ కార్యాలయంలో విద్యార్థిని తల్లిదండ్రులు మంత్రి కారుమూరిని కలవగా ప్రభుత్వం నుంచి వచ్చిన రూ. 65వేలు, కారుమూరి సేవా సమితి నుంచి రూ. 35వేలు జమచేసి మొత్తం రూ. 1 లక్షను విద్యార్థిని పేరుమీద బ్యాంకులో డిపాజిట్ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో చదువుకున్న వారికి ఎంత చదువైనా అందించే వెసులుబాటు ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు ఎండీ సలీముద్దీన్, సాజీదలతోపాటు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఏఎంజీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, షేక్ బాజీ పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని నియంత్రించాలి


తాడేపల్లిగూడెం మండలంలో దోమల నివారణపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల వ్యాప్తిని నియంత్రించవల్సిన బాధ్యత ప్రజలు, ఆరోగ్య సిబ్బందిపై ఉందని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నవాబుపాలెం, కొత్తూరు, కృష్ణాయపాలెం గ్రామాల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలే సమాజానికి ప్రధాన శత్రువులని పేర్కొన్నారు. దోమల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అశోక్‌బాబు, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీ ఆశాలత, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, శానిటేషన్ కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులు ఎం.లక్ష్మనరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రై డే లో ప్రజలను భాగస్వాములను చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే లో ప్రజలను భాగస్వాములను చేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలైన కడకట్ల, యాగర్లపల్లి, వీకర్స్‌కాలనీ, బీబీ సెంటర్‌ల్లో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాలను శుక్రవారం హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు రమణ, వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, శానిటేషన్ కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుమ్మంపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

అత్తిలి: గుమ్మంపాడు గ్రామంలో శనివారం సాయంత్రం జరిగే గడపగడపకు మనప్రభుత్వ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. పార్టీనాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

విశాఖ విజ్ఞాన సందర్శనకు గోయంకా విద్యార్థులు

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాఠ్యప్రణాళికలో భాగంగా శుక్రవారం సాయంత్రం గూడెం రైల్వేస్టేషన్ నుంచి విశాఖ బయలుదేరి వెళ్లారు. అనకాపల్లి, పరవాడ ఫార్మాసిటీ, విశాఖ ఐటీ హబ్, స్టీల్ ప్లాంట్, ట్రైబల్ మ్యూజియం తదితర ప్రదేశాలు సందర్శించేనున్నట్లు అధ్యాపకులు తెలిపారు.

27వ తేదీన ఉచిత స్క్రీనింగ్ టెస్టుల వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణానికి చెందిన ఆత్మబంధువుల సేవా సంఘం వారి ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని మాధవరం గ్రామంలో ఈ నెల 27వ తేదీన మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణా పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా సంఘం సభ్యులు వెల్లడించారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ హైదరాబాద్ వైద్యులు సారథ్యంలో క్యాన్సర్ లక్షణాలను ముందుగా పనిగట్టే అత్యాధునిక యంత్రాలు ఉన్న మొబైల్ బస్సులో వివిధ టెస్టులు మెమోగ్రఫీ, ఎక్స్‌రే, పెప్సిమర్ చేసి ఆ రిపోర్టులు అందజేస్తామని వెల్లడించారు. మాధవరం, పరిసర గ్రామ ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్న సురక్ష పథకాన్ని వీక్షించిన ప్రజాప్రతినిధులు

పెంటపాడు: జగనన్న సురక్ష పథకం ప్రారంభం సందర్భంగా సీఎం జగన్ ప్రసంగాన్ని ప్రతి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన టీవీల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిదులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు వీక్షించారు. పెంటపాడు సమావేశ మందిరంలో ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, తోట నిరీక్షణరావు, డీపీవో, మండల ప్రత్యేకాధికారి జీవీకే మల్లికార్జునరావు, ఎంపీడీవో బాలాజీ, పంచాయతీరాజ్ ఏఈ నవీన్, ఏపీఎం లక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి విజయానందరెడ్డి, గోకా వెంకటేశ్వరరావు, తాడేపల్లి ఈశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.